ప్రజాశక్తి

బుధవారం 10 ఏప్రిల్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉద్యమ సారధులు.. సిపిఎం అభ్యర్థులు

◆ గాజువాక, అరకు, రంపచోడవరం అసెంబ్లీ స్థానాల నుంచి జగ్గునాయుడు, గంగరాజు, లోతా రామారావు పోటీ

◆ అరకు పార్లమెంట్ బరిలో అప్పలనర్స

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అరకులోయ, పాడేరు, రాజవొమ్మంగి విలేకరులు

కార్మిక చైతన్యానికి, ఆదివాసీల పోరు స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి సిపిఎం పోరాట సారథులను ఎన్నికల బరిలో నిలిపింది. ఈ క్రమంలో విశాఖ జిల్లాలోని కార్మికవాడ గాజువాక నియోజకవర్గం నుంచి మరడాన జగ్గునాయుడు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు నియోజకవర్గం నుంచి దీసరి గంగరాజు, రంపచోడవరం నియోజకవర్గం నుంచి లోతా రామారావు ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో దిగుతున్నారు. అరకు పార్లమెంట్ స్థానం నుంచి పాచిపెంట అప్పలనర్స పోటీ చేస్తున్నారు. వారి అభ్యర్థిత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ప్రకటించారు. ఎన్నికల పోరులో నిలిచిన అభ్యర్థులంతా సుదీర్ఘ ఉద్యమానుబంధం కలిగినవారు. ప్రజా సంఘాలకు నేతృత్వం వహించినవారు. ఎర్రజెండాను చేతబూని కార్మిక, కర్షకులకు, ఆదివాసీలకు విజయాలు సాధించిపెట్టినవారు.

గాజువాక అభ్యర్థిగా జగ్గునాయుడు

విశాఖ జిల్లాలోని గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జగ్గునాయుడు 1985 నుంచీ కార్మికునిగా, కార్మిక నాయకునిగా ప్రజా సమస్యలపై అంకితమై పనిచేస్తున్నారు. ప్రస్తుతం సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి బాధ్యతల్లో ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు కార్మికోద్యమాలు, ప్రజా పోరాటాల్లో కీలక భూమిక మిగతా 2లో..

ఎం.జగ్గునాయుడు (గాజువాక)

దీసరి గంగరాజు (అరకు)

పి.అప్పలనర్స (అరకు పార్లమెంట్ స్థానం)

లోతా రామారావు (రంపచోడవరం)

అరకు ఎంపీ అభ్యర్థిగా అప్పలనర్స

అరకు లోక్‌సభ (ఎస్‌టి రిజర్వుడ్) నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా ఆదివాసీ ఉద్యమ నేత పాచిపెంట అప్పలనర్స పోటీ చేస్తున్నారు. ఆయన ప్రస్తుతం సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శిగా, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1983లో అరకులోయ మండలం బొండం గ్రామంలో జన్మించారు. గిరిజన రైతు కుటుంబంలో జన్మించిన అప్పలనర్స విద్యార్థి దశ నుంచి ఉద్యమ నేతగా ఎదిగారు. ఈ ప్రాంతంలో గిరిజన విద్యార్థుల సమస్యలపై పోరాటాలు సాగించారు. 1998 నుంచి 2008 వరకు విద్యార్థి సంఘమైన ఎస్ఎఫ్ఐ నాయకునిగా ఉన్నారు. ఎస్ఎఫ్ఐ పాడేరు డివిజన్ అధ్యక్షునిగా, కార్యదర్శిగా, మిగతా 2లో..

హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్ - కటక్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 07165 హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 16, 23, 30 తేదీల్లో ప్రతి మంగళవారం రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 09.07 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 17.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 17, 24, మే 1 తేదీలలో ప్రతి బుధవారం రాత్రి 22:30 గంటలకు కటక్ నుంచి బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 07.35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 07.37 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 21.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

ఈ రైళ్లు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్ మీదుగా ప్రయాణిస్తాయి. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వైసిపికి ఎంపిపి, వైస్ ఎంపిపి రాజీనామా

▶ వార్త 3లో..

కల్వర్టు నిర్మాణ పనుల్లో జాప్యం

▶ వార్త 4లో..

'పశ్చిమ' నుంచి విమలను గెలిపించండి

▶ వార్త 4లో..

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు తగవు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు రామస్వామి వార్త మెయిన్‌లో..

ప్రజలు కలివిడితత్వంతో ముందుకు సాగాలి

ఉగాది వేడుకల్లో కలెక్టర్ మల్లికార్జున సందేశం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'తెలుగు జాతి మొత్తం కలిసికట్టుగా చేసుకునే పండగ ఉగాది. ఆ స్ఫూర్తిని కాపాడుతూ అందరూ ఐక్యంగా ముందుకు సాగాలి. కలివిడితత్వంతో ముందుకెళ్లాలి' అని విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. నగరంలోని వుడా చిల్డ్రన్ ఎరీనాలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం అతిథులందరూ పంచాగంలో పేర్కొన్న విశేష అంశాలను ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. పంచాంగ కర్త రొంపిచర్ల సింగరాచార్యులు పంచాగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ సంప్రదాయాలను, తెలుగు మూలాలను మర్చిపోకుండా వేడుకలను నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. ఉగాది వేడుకల్లో భాగంగా సందేశాన్ని అందించిన ఆయన జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా తెలుగు జాతి మొత్తం కలిసికట్టుగా చేసుకునే పండగ ఉగాది అని పేర్కొన్నారు. విశిష్ట సేవలందించిన వారికి ఉగాది పురస్కారాలు మిగతా 2లో..

ఉగాది వేడుకల్లో విశాఖ కలెక్టర్ మల్లికార్జున, పలు విభాగాల అధికారులు

ఉద్యమ సారథులు.. సిపిఎం అభ్యర్థులు

(మొదటి పేజీ తరువాయి..) పోషించారు. గాజువాక, మల్కాపురం కేంద్రాలుగా అనేక ఉద్యమాలు నడిపారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్‌గా, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులుగా, హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా, షిప్‌యార్డు రక్షణ రంగం కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా, విశాఖ పోర్టు గొడౌన్స్ అండ్ ఆల్ రైల్వే సైడింగ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. సేవా కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర పోషించారు. హుదూద్ తుపాను, కరోనా, అగ్ని ప్రమాదాలు, ఎల్‌జి పాలిమర్స్ విస్ఫోటనం, ఫార్మా కంపెనీలు, హెచ్‌పిసిఎల్ పరిశ్రమల్లో గతంలో ప్రమాదాల జరిగిన సందర్భాల్లో అక్కడి బాధితులకు సేవలందించారు. కావాల్సిన సహాయాన్ని అందించారు. నగరంలో పలుచోట్ల ఉచిత వైద్యశిబిరాలు, ట్యూషన్ సెంటర్లు, కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయించారు. గాజువాక ప్రాంతంలో ప్రత్యేక కృషి సలిపారు. గాజువాక బానోజీతోట, మల్కాపురం, అచ్చిoనాయుడుతోట తదితర ప్రాంతాల్లో భూ పోరాటాలు నిర్వహించారు. భూములను కాపాడటం, పేదలకు ఇళ్ల సాధన కోసం కృషిచేశారు. అలాగే గాజువాక ఇనాం భూముల పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. గాజువాక ప్రాంతంలో అదానీ గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఉద్యమించారు. శీలానగర్ వద్ద సూపర్ స్పెషాలిటీ ఇఎస్ఐ ఆసుపత్రి సాధనకు కృషి చేసి నిర్మాణ అనుమతులు సాధించారు. గాజువాక, పశ్చిమ నియోజకవర్గంలోగల పలు పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ, ఉపాధికై జరిగిన ఆందోళనల్లో ఆయనది కీలకపాత్ర. విశాఖ ప్రజలపై ప్రభుత్వాలు మోపిన ఆస్తి, చెత్త పన్నులకు వ్యతిరేకంగా పోరాడారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ సాధన పోరాటాల్లోనూ కీలకంగా వ్యవహరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజల మద్దతును కూడగట్టేందుకు ఉమ్మడి ఉత్తరాంధ్రలో జరిగిన బైక్ యాత్ర, నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై పోరాటం సాగించారు. ప్రజా పోరాటాల సందర్భంగా ప్రభుత్వాల నుంచి తీవ్ర నిర్బంధం, అక్రమ కేసులు ఎదురైనా వెరవలేదు. 4 పర్యాయాలు 25 రోజులపాటు జైలు జీవితం గడిపారు.

అరకు అసెంబ్లీ అభ్యర్థిగా గంగరాజు

సిపిఎం అరకు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దీసరి గంగరాజు ప్రస్తుతం అనంతగిరి మండల జెడ్‌పిటిసి సభ్యులుగా ఉన్నారు. ఆయన విద్యార్థి దశ నుంచీ పోరాటంలో ఉన్నారు. అనంతగిరి మండలం అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం అనంతగిరి మండల కేంద్రానికి సమీపంలోనున్న బొడ్డ చెట్టు కాలనీలో నివాసం ఉంటున్నారు. 1980 జూన్ 1న జన్మించారు. డిగ్రీ వరకు చదువుకున్నారు. వృత్తిరీత్యా వ్యవసాయ కుటుంబం. సిపిఎం పూర్తిస్థాయి కార్యకర్తగా పనిచేస్తున్నారు. గంగరాజు ఆదర్శ ప్రజాప్రతినిధిగా గుర్తింపునొందారు. ఆయన తండ్రి దీసరి లచ్చు అనంతగిరి పంచాయతీ సర్పంచ్‌గా 1987 నుండి 1992 వరకు పనిచేశారు. గంగరాజు విద్యార్థి సంఘంలో పనిచేస్తూ 1998-99 కాలంలో గిరిజన సంఘంలో చేరారు. సిపిఎంలో 2000లో చేరారు. అనేక పోరాటాలకు నేతృత్వం వహించారు. కులమతాలకు అతీతంగా పని చేస్తూ అందరి మన్ననలూ పొందారు. 2012లో అనంతగిరి నుంచి జిసిసి డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికలలో ఎంపిటిసిగా పోటీ చేసి టిడిపి, వైసిపిలను ఓడించి సిపిఎం ఎంపిటిసిగా గెలుపొందారు. 2021లో సిపిఎం జెడ్‌పిటిసి అభ్యర్థిగా పోటీ చేసి వైసిపి, టిడిపిలను ఓడించి విజయఢంకా మోగించారు. జిల్లా పరిషత్ సమావేశాల్లో, పాడేరు ఐటిడిఎ పాలకవర్గ సమావేశాల్లో గిరిజనుల వాణిని వినిపిస్తున్నారు. అనంతగిరి మండలం బొర్రా పంచాయతీలో అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలని పోరాడి జైలు జీవితం గడిపారు. 2005లో గిరిజనుల మనుగడను దెబ్బతీసే బాక్సైట్ తవ్వకాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ అనంతగిరి మండలం వలసి నుంచి పాదయాత్ర ప్రారంభించి ఏజెన్సీ ప్రాంతమంతా తిరిగి విశాఖ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గిరిజన పంచాయతీలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్పించాలని 2007 నుంచి పోరాటం నిర్వహిస్తున్నారు. ఆదర్శ ప్రజా ప్రతినిధిగా పేరుగాంచిన ఆయన ఇప్పటికే అరకు నియోజకవర్గంలో ప్రచారంలో దూసుకుపోతున్నారు.

రంపచోడవరం అభ్యర్థిగా రామారావు

రంపచోడవరం నియోజకవర్గం నుంచి సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న యువకుడు లోతా రామారావు. కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, వామపక్షాలు బలపరుస్తున్న సిపిఎం అభ్యర్థిగా ఆయన ఇప్పటికే ప్రచారం జోరుగా చేస్తున్నారు. రాజవొమ్మంగి మండలం లోదొడ్డి పంచాయతీ కేశవరం గ్రామానికి చెందిన రామారావు 1991లో జన్మించారు. తల్లిదండ్రులు బాలరాజు, గౌరమ్మ. వీరిది వ్యవసాయ కూలీ కుటుంబం. 2015లో రామారావుకు వెంకటలక్ష్మితో వివాహమైంది. రామారావు 2005లో సిపిఎంలో చేరారు. 2008లో రాజవొమ్మంగి మండల కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత పలు పోరాటాలు సాగించారు. ప్రస్తుతం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా పనిచేస్తున్నారు. 2006 గిరిజన సంఘం మండల కమిటీ సభ్యునిగా ఎన్నికైన ఆయన నేడు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఏజెన్సీలో యువజన, విద్యార్థి సంఘాల్లో పనిచేశారు. 2018 నుంచి 2021 వరకూ సిఐటియు జిల్లా కార్యదర్శిగా కొనసాగారు. 2013, 2022ల్లో జరిగిన ఎన్నికల్లో లోదొడ్డి పంచాయతీ సర్పంచ్‌గా రామారావు ఘన విజయం సాధించారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 14 ముఖ్యంగా లోదొడ్డి గ్రామానికి సుమారు కిలోమీటర్ల రోడ్డును సాధించారు. దీని నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు నిరాకరించడంతో పోరాటాలు చేసి ఫారెస్ట్ క్లియరెన్స్ కూడా పొందారు. పంచాయతీలోని కొండమీద ఉన్న కిండంగి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఉద్యమించి విజయం సాధించారు. ఆ గ్రామంలోని కొండపోడు భూములకు పట్టాలను ఇప్పించారు. పంచాయతీలోని నాలుగు గ్రామాలకు మెటల్ రోడ్లు వేయించారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్రామ సచివాలయం ఏర్పాటు చేయాలంటే రెండు వేల మంది జనాభా ఉండాల్సి ఉంది. అయితే లోదొడ్డి పంచాయతీలో 1050 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఆ పంచాయతీకి సచివాలయం రాలేదు. అయితే అక్కడి పరిస్థితులను రామారావు అప్పటి జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి సచివాయం ఏర్పాటు చేయించారు. 2006లో పోడు భూముల కోసం జరిగిన పోరాటాల్లో రామారావు కీలకపాత్ర పోషించారు. గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాల హయాంలో గిరిజనుల సమస్యలపై ఆయన అనేక పోరాటాలు నిర్వహించారు. తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జిఒ 3 పునరుద్ధరణ కోసం ఏజెన్సీ అంతటా సాగుతున్న పోరాటంలో కీలక భూమిక పోషిస్తున్నారు. పోలవరం నిర్వాసితుల పక్షాన ఆయన పోరాడుతున్నారు. విఆర్.పురం, కూనవరం, ఎటపాక, చింతూరు ప్రాంతాల్లో నిత్యం పర్యటిస్తూ ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

అరకు ఎంపీ అభ్యర్థిగా అప్పలనర్స

(మొదటి పేజీ తరువాయి..) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, జాతీయ కార్యవర్గ సభ్యునిగా పని చేశారు. 2011 నుంచి గిరిజన సంఘం విశాఖ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి గిరిజన హక్కుల పరిరక్షణ కోసం, గిరిజన చట్టాల పరిరక్షణ కోసం పోరాటాలు చేశారు. 2017లో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పలు గిరిజన ఉద్యమాలకు నేతృత్వం వహించారు. తన ఉద్యమ ప్రస్థానంలో 15 రోజులపాటు జైలు జీవితం గడిపారు. 2013 లో హుకుంపేట మండలంలో ఆదివాసీలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని నిర్వహించిన భూపోరాటంలో కీలకపాత్ర పోషించారు. 1998 నుంచి 2000 వరకు గిరిజన విద్యార్థులకు కళాశాలల్లో ఉచిత అడ్మిషన్ కల్పించాలని, డిగ్రీ, జూనియర్ కళాశాలలు ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని ఉద్యమించారు. 2003లో ఎంవిఎస్.శర్మ నాయకత్వంలో 25 రోజుల పాటు జరిగిన ఏజెన్సీ ప్రాంత సమగ్రాభివృద్ధి పాదయాత్రలో పాల్గొన్నారు. 2008లో విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంపుదల కోసం నాటి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఏడు రోజులు నిరాహార దీక్ష చేపట్టారు. 2009లో విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి విశాఖ జిల్లాలో 30 రోజులపాటు సైకిల్ యాత్ర జరిపారు. అంటరానితనాన్ని రూపుమాపడానికి జరిగిన సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. ఆదివాసీలకు స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని 2010 నుంచి నేటి వరకూ ఉద్యమాలు నడుపుతూ వస్తున్నారు. విజయాలు సాధించారు. 2011లో కొండ కుమ్మర్లను ఎస్‌టి జాబితాలో చేర్పించాలని ఉద్యమం నిర్వహించారు. పారా మెడికల్ సిబ్బంది సమస్యలపైనా, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలపైనా ఉద్యమించారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ పోరాటాలు చేపట్టారు. నాటి భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు వినతిపత్రం సమర్పించడానికి వెళ్లిన ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. బాక్సైట్ పోరాటంలో కీలక భూమిక పోషించారు. కాఫీ రైతులు, మాతృభాషా వాలంటీర్ల సమస్యలపైనా ఉద్యమించారు. జిఒ 3 పునరుద్ధరణ కోసం న్యాయపోరాటం సాగిస్తున్నారు. 41 సంవత్సర అప్పలనర్స ఎంఎ చదువుకున్నారు. తల్లిదండ్రులు పెద్ద అప్పలస్వామి, గంగమ్మ, భార్య గంపరాయి దేవమణి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్నారు.

ఉగాదితో ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలను దక్షిణ నియోజకవర్గంలోని దేవాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో పాటు, వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఆలయాలను సందర్శించి వేడుకలలో సందడి చేశారు. ఆలయాల దర్శనాలకు భక్తులు పోటెత్తారు. సంపత్ వినాయగర్, శ్రీ కనకమాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, దొండపర్తిలోని శ్రీ ఎరుకుమ్మవారి దేవస్థానం ఆలయాలు కిటకిటలాడాయి.

మొదటి పేజీ తరువాయి..

ప్రజలు కలివిడితత్వంతో ముందుకు సాగాలి

అందజేశారు. పోర్టు ఏరియా పరిధిలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పని చేస్తున్న కె.అనంత వెంకట వరహా కష్ణమాచార్యులు, పద్మనాభం మండలం పెంట గ్రామంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పని చేస్తున్న బి.బుచ్చమ్మ, ఆనందపురం మండలం కొల్లివానిపాలెం గ్రామ పరిధిలోని రామాలయంలో సేవలందిస్తున్న వి.నరసింహాచార్యులు, బురుజుపేటలోని శ్రీకనక మహాలక్ష్మి దేవస్థానంలో పని చేస్తున్న ప్రధాన అర్చకులు కొడమంచిలి శ్రీనివాసశర్మ, అర్చకులు వాడపల్లి గోపాలాచార్యులు, సామవేద పండితులు కోటా పంచముఖి శర్మ ఉగాది పురస్కారాలను అందుకున్నారు. వారికి ఒక్కొక్కరికీ రూ.10,116 విలువగల చెక్కులను కలెక్టర్ అందించారు. వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖ, భీమిలి ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, టూరిజం ఆర్‌డి శ్రీనివాస ఫణి, దేవాదాయ శాఖ డిసి శిరీష, విఎంఆర్‌డిఎ జెసి రవీంద్ర, యుసిడి పీడీ పాపునాయుడు, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

టిడిపిలోకి విశాఖ దక్షిణం నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైసిపికి కొద్ది నెలల క్రితం రాజీనామా చేసిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ టిడిపిలో చేరారు. మంగళవారం మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సుధాకర్ మెడలో పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సుధాకర్‌తో పాటు జివిఎంసి 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, పూర్ణా మార్కెట్ సమీపంలోని శ్రీ దుర్గాలమ్మ దేవస్థానం ధర్మకర్త బత్తి మంగరాజు, గరుడ సత్రం ధర్మకర్త చరకం మణమ్మ, స్థానిక నాయకులు కంటిపిల్లి వరలక్ష్మి, వైసిపి 35వ వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీ శంకర్, వర్తక సంఘం సభ్యులు రామిరెడ్డి, నిమ్మ శ్రీనివాస్, ముక్కు శ్రీనివాస్ తదితరులు విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి టిడిపిలో చేరిన వారిలో ఉన్నారు. సుధాకర్ విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని భావించి వార్డుల్లో రెండేళ్లుగా పలు కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. ఈ నియోజకవర్గం నుంచి ఆయనకు టికెట్ కేటాయించకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌వైపే వైసిపి అధిష్టానం మొగ్గు చూపింది. ఈ క్రమంలోనే సుధాకర్ కొద్ది నెలల క్రితం అధికార పార్టీకి రాజీనామా చేశారు. ఆయన గత ఏడాది జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన విషయం తెలిసిందే.

టిడిపి ప్రచారంలో దేవస్థానం ఉద్యోగి...!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : రాజకీయ పార్టీల ప్రచారం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కడం సహజమే. అయితే అది పార్టీల శ్రేణులు, కార్యకర్తల వరకూ పరిమితంగా ఉంటే ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. కొద్ది మంది ప్రభుత్వ ఉద్యోగుల ఉత్సాహం అక్కడక్కడా కనిపిస్తోంది. విశాఖపట్నం సింహాచలం దేవస్థానం ఉద్యోగిగా ఉన్న ఒకాయన తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్‌లో ప్రచారంలో పాల్గొనడం నగరంలో చర్చనీయాంశం అయ్యింది. అడవివరం సమీపానగల శ్రీలక్ష్మీనరసింహానగర్, సింహాద్రిపురంనకు చెందిన ఆ దేవస్థాన ఉద్యోగి నగరంలోని హెచ్‌బి.కాలనీలో తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారంలో పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగి

14 నుంచి శ్రీ కరకచెట్టు పోలమాంబ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 14 గ్రామాల ఆరాధ్య దైవంగా పేరొందిన పెద్దవాల్తేరులోని శ్రీశ్రీశ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షిక జాతర మహోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుండి వచ్చే నెల 14వరకు నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.గాయత్రి తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై భీమునిపట్నం రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ తరపున సీతమ్మధార తహశీల్దార్ శ్రీరామమూర్తి అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో దేవస్థానంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. వారు తీసుకున్న నిర్ణయం మేరకు.. ఈ నెల 14న చాటింపుతో పండగ మొదలవుతుంది. 15న పందిరి రాట మహోత్సవం జరుగుతుంది. అదే రోజు సోమవారం (పుట్ట బంగారం) అమ్మవారి దేవర పండగను ఘనంగా నిర్వహిస్తారు. 22న తొలేళ్ళ ఉత్సవం, 23న అనుపు ఉత్సవం ఉంటాయి. 30న మంగళవారం మారువారం పండుగను నిర్వహిస్తారు. మే 4న శనివారం మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. ఉత్సవాలు జయప్రదం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నారు. భక్తులకు ఉచితంగా తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తారు. ఎండ వేడిమి నేపథ్యంలో టెంట్లు వేయదలిచారు. అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరగడానికి అన్ని విభాగాల అధికారులు సహకరించాలని ఆలయ ఇఒ కె.గాయత్రి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, జోన్ 1 ట్రాఫిక్ ఎసిపి, పోలీస్, జీవీఎంసీ, విద్యుత్, ఫైర్ శాఖ అధికారులు, గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

20వ వార్డులో ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ 20వ వార్డు లాసన్స్ బే కాలనీలో పాదయాత్ర కొనసాగించారు. 85వ రోజుకు చేరుకున్న ఆయన పాదయాత్రలో వార్డు కార్పొరేటర్ ముఞ్వల లక్ష్మి, సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవివి మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి రథసారథి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు.

బిఎస్‌పి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలంలోని బి.సి.కాలనీ, ఎస్‌సికాలనీ, గిడిజాల వేములవలస గ్రామాల్లో బిఎస్‌పి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఆయా కాలనీలకు చెందిన పలువురు బిఎస్‌పిలో చేరారు. భీమిలి బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థి భాగం గోపాలరావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ, భీమిలి నియోజకవర్గంలో అనేకమంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు పోరాటం ద్వారా కొన్ని వందల ఇళ్ల స్థలాలను ఇప్పించానని తెలిపారు. తనపై ఉన్న నమ్మకంతో వారంతా బిఎస్‌పిలో చేరారని తెలిపారు. మండలంలో అనేకమంది పార్టీలో చేరడానికి సుముఖంగా ఉన్నారన్నారు. స్థానికుడునైన తనను గెలిపిస్తే భీమిలి నియోజకవర్గ ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు. ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ పండగ

ప్రజాశక్తి -ఆనందపురం : పైడితల్లి అమ్మవారు వెల్లంకి సాదుమటం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు మంగళవారం ఉదయం నుంచీ భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఏటా ఉగాది పర్వదినాన పైడితల్లి అమ్మవారు వెల్లంకి సాదుమటం పండగను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ మూడు రోజులు అమ్మవారిని భక్తులు దర్శించుకుంటారు. సాధుమట ఉత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటు పండగ తీర్థం, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తారు.

నేడు గంటా ఎన్నికల ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు తన ఎన్నికల ప్రచారాన్ని బుధవారం మండలంలోని మత్స్యకార గ్రామమైన అన్నవరం నుంచి ప్రారంభించనున్నట్లు క్యాంప్ కార్యాలయం వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు శ్రీ రామాలయంలో పూజలు, 7.30 నుంచి 9.15 వరకు అన్నవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం, 9.30 నుంచి 10.30 వరకు పెదనాగమయ్యపాలెంలో ప్రచారం, 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మజ్జివలసలో గంటా శ్రీనివాసరావు సమక్షంలో పలువురు వైసిపి నాయకుల చేరికలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 5 నుంచి 5.30 వరకు పాత మూలకుద్దు, 5.30 నుంచి 6.45 వరకు చిప్పాడలో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైసిపికి ఎంపిపి, వైస్ ఎంపిపి రాజీనామా

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణరాజు (వాసు రాజు) తో పాటు అమనాం సర్పంచ్ దంతులూరి ఉమాదేవి, వైస్ ఎంపిపి సురపతి దుర్గాలమ్మ (అన్నవరం ఎంపిటిసి), దాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు వైసిపికి రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి అమనాంలోని ఎంపిపి స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారంతా మాట్లాడారు. గత నాలుగేళ్లగా స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తనను, తన అనుచరులను లక్ష్యంగా చేసుకుని అనేక విధాలా ఇబ్బందులకు, అవమానాలకు గురి చేయడాన్ని జీర్ణించుకోలేకనే తప్పని సరి పరిస్థితుల్లో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతానికి ఏ రాజకీయ పార్టీలో కూడా చేరడం లేదని వెల్లడించారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వాసురాజు

జోరుగా పెదగదిలి బ్రిడ్జి పనులు

జోరుగా సాగుతున్న పెదగదిలి బ్రిడ్జి పనులు

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ రహదారి పెదగదిలి నుంచి తోటగరువు వైపు వెళ్లే ప్రధాన రహదారిలో పెదగదిలి వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు జోరుగా సాగుతున్నాయి. సుమారు రూ 3.5 కోట్లతో నిర్మిస్తున్న ఈ బ్రిడ్జి పనులు మరో నెలలో పూర్తయ్యేలా కనిపిస్తోంది. బ్రిడ్జి పనులు పూర్తయిన తరువాత పెదగదిలి నుంచి తోటగరువు, బాలాజీనగర్, అంబేద్కర్ కూడలి గుండా సూర్యతేజనగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. వీటన్నింటికి సుమారు రూ.11 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇవన్నీ పూర్తయితే ఆరిలోవలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుముఖం పట్టవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : గ్రామ దేవత నూకాలమ్మ ఉత్సవం సందర్భంగా మంగళవారం పలు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. నూకాలమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సహకారంతో మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జి 1 హాస్పిటల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ గౌతమి దివ్యశ్రీ భక్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సభ్యులు నిమ్మకాయల భాస్కర్, శివ గోపీనాథ్, తేజ, గణేష్, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గౌతమి దివ్యశ్రీ

భక్తులకు పులిహోర పంపిణీ

కాపునాడు సంఘం ఆధ్వర్యాన మంళవారం భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చెల్లూరి గౌరినాయుడు, కార్యదర్శి ప్రగడ సత్యనారాయణ, కోశాధికారి నగిరెడ్డ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. శ్రీకనక దుర్గ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన భక్తులకు పట్టణ ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు చేతుల మీదుగా ప్రసాదం పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అప్పికొండ నరసింగరావు, వైస్ ప్రెసిడెంట్ బోర తిరుమలేశ్వర రెడ్డి, కార్యదర్శి భరత్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

చలివేంద్రం ప్రారంభోత్సవంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : స్థానిక శ్రీ మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ, ఎంఎస్‌ఆర్ యాజమాన్య ప్రతినిధులు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ ఆధ్వర్యాన స్థానికంగా మూడు చోట్ల మంగళ వారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు స్థానిక వర్తక సంఘం అధ్యక్షులు దుర్గా మురళి, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు చెరుకూరి దేవుళ్ళ, రాధిక షాపింగ్ మాల్ అధినేత కె.అప్పారావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలోని మళ్ల సురేంద్ర ఇంటి దగ్గరలో మజ్జిగ చలి వేంద్రాన్ని మంగళవారం బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్ల సురేంద్ర మాట్లాడుతూ హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఎండాకాలంలో మెయిన్ రోడ్‌లో పాదచారులకు, ఆటో కార్మికులకు ఉపయోగపడే విధంగా ఈ మజ్జిగ చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ మజ్జిగ చలివేంద్రం ప్రతి ఆదివారం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు మరిశెట్టి బాల తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్ల రామ్ బుజ్జి, ఎల్లపు శ్రీను, నరగడం సంతారం, ఆది, నగేష్, హరీష్, భాస్కర్, సంతోష్, నర్సింగ్, ఆనంద్, భానుచంద్ర, ఫణి, జొన్నాడ సురేష్, ఎండకుర్తి అప్పలరాజు, కర్రి మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

27 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ఎక్సైజ్ కేసు నమోదైంది. ఆనందపురం మండలం వందలపాక పంచాయతీ పరిధి బాకూరుపాలెంలో సిఐ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. షాపులో గొర్ల శ్రీను మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతని నుంచి 27 లిక్కర్ బాటిళ్లు (180 ఎం.ఎల్) స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గొర్ల శ్రీను బాకూరుపాలెంలోని ఆయన ఇంట్లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు గుర్తించారు. సిఐ తిరుపతిరావు ఆధ్వర్యాన ఎస్ఐ శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

చండ్ర ఆశయ సాధనకు కృషి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎర్ర జెండా పోరాటమే శరణ్యమని దేశ ప్రజలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి చండ్ర రాజేశ్వరరావు ఆశయాల సాధనకు అందరూ ఐక్యతతో పోరాడాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో చండ్ర రాజేశ్వరరావు 30వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేయడం ద్వారా పేదరికం నిర్మూలన చేయగలమని ఆయన విశ్వసించేవారని తెలిపారు. వేలాది మంది పేదలకు భూపోరాటం ద్వారా భూములు పంపిణీ చేశారన్నారు. దేశంలో బిజెపి మతోన్మాద విధానాలు భారత దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరాలశెట్టి సత్యనారాయణ, సాయి లక్ష్మణ్, కోరిబిల్లి శంకరరావు, సూరిబాబు, కోన లక్ష్మణ్, సంతోష్, సతీష్, రమణ తదితరాలు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణ వసంత నవరాత్రుల ఉత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి సీతమ్మపేట, కనకమ్మ వారి వీధి రాధాకృష్ణ టెంపుల్ దగ్గర సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు ఆధ్వర్యాన సీతారామ కల్యాణ వసంత నవరాత్ర మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు పాల్గొని ప్రత్యేక పూజలు, మంగళ స్నానాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, 25వ వార్డు నాయకులు సారిపిల్లి సంతోష్, హరి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో పెళ్లి రాట ఉత్సవం

ప్రజాశక్తి-సింహాచలం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సింహాద్రి అప్పన్న ఆలయంలో ఏటా మాదిరిగానే స్వామివారి కల్యాణోత్సవానికి ముందుగా జరిగే పెళ్లి రాట ఉత్సవాన్ని ఈవో సింగాల శ్రీనివాసమూర్తి దంపతులు, ట్రస్టుబోర్డు సభ్యులు, ఆలయ అర్చక స్వాములు భక్తుల కోలాహల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని అర్చకులు సీతారామాచార్యులు చదివి భక్తులకు వినిపించారు. ఉగాది రోజున స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ తిరువీధి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

కణమాంలో జోరుగా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-ఆనందపురం : భీమిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును బలపరుస్తూ కణమాం గ్రామంలో ఇంటింటికీ వైసిపి నాయకులు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బంక సత్యం, జెడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, ఎంపిపి మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపి పాండ్రంగి శ్రీను, నాయకులు గండ్రెడ్డి శ్రీనివాస్, గొలగాని కృష్ణ, పిన్నింటి వెంకటరమణ, లెంక రాంబాబు, సింహాచలం నాయుడు, ఎర్ర అప్పలనాయుడు, కోరాడ ముసలి నాయుడు, పడాల రాము, చందక స్వామి పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల్లో జాప్యం

కుంచుమాంబ కాలనీ వాసులకు ఇబ్బందులు
పైపులైన్లు పగలడంతో అందని తాగునీరు

కొనసాగుతున్న కుంచుమాంబ కాలనీ కల్వర్టు పనులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 71వ వార్డు పరిధి కుంచుమాంబ కాలనీలో నిర్మాణం చేపట్టిన కల్వర్టు పనులను అసంపూర్తిగా వదిలివేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ కాలనీ తరచూ ముంపునకు గురవుతుండటంతో దాని నివారణకు కాలనీ ప్రారంభంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లే గెడ్డను కలుపుతూ జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం ఆరు నెలల క్రితం ఎస్టిమేషన్ వేసింది. తర్వాత ఫిబ్రవరి నెలలో ఆ పనులకు శంకుస్థాపన చేశారు. మార్చి 10వ తేదీ నుంచి పనులు ప్రారంభించారు. ఈ పనులు నత్తనడకన సాగడంతో స్థానికంగా నివాసముంటున్న కుంచుమాంబ కాలనీ ప్రజలు, ఎల్‌బి.నగర్ ప్రజలు, సమైక్య, సిరి, గ్రీన్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్ల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంత ప్రజలు వారి గృహాలకు వెళ్లాలన్నా, గాజువాక లేదా ఏ ఇతర ప్రదేశాలకు వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పనులు పూర్తిగా కాకపోవడంతో కాలనీ ప్రజలు శ్రీనగర్ మీదగా గాజువాక వెళ్తున్నారు. గాజువాక ఆటోనగర్ పనిచేస్తున్న మొత్తం 10 వేల మంది కార్మికుల్లో, రోజుకు 5000 మంది ఈ రహదారి వెంబడి ప్రయాణం చేస్తున్నారు. ఇది పూర్తికాకపోవడంతో వారంతా శ్రీనగర్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పగలు ఇబ్బంది లేకపోయినప్పటికీ రాత్రి సమయంలో వచ్చే కార్మికులు, కాలేజీ విద్యార్థులు శ్రీనగర్ రహదారి మీదుగా రావాలంటే ఇబ్బందులుపడుతున్నారు. లైట్లు కూడా లేని రోడ్డు కావడంతో భయం భయంగా ఉంటోందని స్థానికులు చెందుతున్నారు. ప్రతి ఆదివారం జరగాల్సిన సంత కూడా ప్రస్తుతం వాయిదా పడుతోంది. అత్యవసర సమయంలో ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో తక్షణమే పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనికి తోడు జివిఎంసి వాటర్ పైపులైన్లు కూడా తవ్వి వదిలేయడం వల్ల వారం రోజులుగా మంచినీటి సరఫరా కూడా నిలుపుదల చేశారు. దీనిపై వాటర్ సప్లై అసిస్టెంట్ ఇంజినీర్ కేదార్‌నాథ్‌ను వివరణ కోరగా తవ్వకాల వల్ల పైప్ లైన్లు పగిలిపోయాయని, మరో మూడు రోజులు మంచినీరు సరఫరా చేయలేమని, అంతవరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని చెప్పారు. కానీ నేటికీ ట్యాంకర్లతో కూడా నీటిని సరఫరా చేయలేదు. మంచినీటి ఇబ్బంది తీవ్రంగా ఉంది. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వీలైనంత తొందరలో పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌బాబును వివరణ కోరగా, వీలైనంత తొందరలో పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఇప్పటికే ఆదేశాలు జారీచేశామని తెలిపారు. ఫిల్లింగ్ పనులు జరిగేటప్పుడు కొంత జాప్యం జరుగుతుందని, ఫిల్లింగ్ పనులు పూర్తయ్యాయి కాబట్టి మిగిలిన పనులు వీలైనంత తొందరలో పూర్తి చేస్తామని తెలిపారు.

ఉక్కునగరంలో ఫ్రైడే మూవీ ముహూర్తపు సన్నివేశం

ప్రజాశక్తి-ఉక్కునగరం : గణేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈశ్వర్ దులిపూడి దర్శకత్వంలో కేసనకుర్తి శ్రీనివాస్, వర్మ కంబాల నిర్మాత, సహ నిర్మాతలుగా రూపొందిస్తున్న ఫ్రైడే చిత్రం ముహూర్తపు షాట్‌ను ఉక్కునగరంలోని జగన్నాథ స్వామి ఆలయం వద్ద చిత్రీకరించారు. ముందుగా చిత్ర యూనిట్ నిర్వహించిన పూజా కార్యక్రమంలో లీడర్ దినపత్రిక అధినేత రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్మాత కేశనకుర్తి శ్రీనివాస్, సహ నిర్మాత వర్మ కంబాల క్లాప్ కొట్టగా, మరో ఫిల్మ్ డైరెక్టర్ యాద్ కుమార్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఈశ్వర్ దులిపూడి, కథానాయిక దియారాజ్ మాట్లాడుతూ, మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నామని, త్వరలోనే షూటింగ్ మొదలవుతుందని తెలిపారు. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఆలోచింపజేసేలా ఉంటుందని తెలిపారు. సస్పెన్స్ థ్రిల్లర్ మూవీగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని చెప్పారు. విశాఖ జిల్లాలోని ముఖ్య పర్యాటక ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరుపుతున్నట్లు తెలిపారు. సినిమాకు ఛాయాగ్రాహకుడుగా పృథ్వీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. చిత్రానికి రాజ్ మరియన్ కథను అందించగా, ప్రజ్వల్ కిషోర్ సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. కార్యక్రమంలో జబర్దస్త్ నటుడు సుధాకర్, ఫిల్మ్ ఇండస్ట్రీ వెల్ విషర్ ఫణి స్వామి, ఫిల్మ్ డైరెక్టర్ ఉదయ్, డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ నుంచి సూర్యనారాయణ, అంకిత్, బాద్‌షా, హర్ష, శివసాయి, రోజా, సాయి, అమ్మోరాజు, జగదీష్ పాల్గొన్నారు.

నేతాజీ వీధిలో ప్రచారం చేస్తున్న బెహరా భాస్కరరావు

నేతాజీ వీధిలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి -గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపు కోసం 91వ వార్డు పరిధి నేతాజీవీధిలో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన మంగళవారం గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. మళ్లీ ఆయన్ను గెలిపించుకోవడం అవసరమన్నారు. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు, కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలకృష్ణ హ్యాట్రిక్ విజయాలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్యాన్స్

గణబాబుకు బాలయ్య ఫ్యాన్స్ మద్దతు

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబుకు ఆయన క్యాంపు కార్యాలయంలో సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ మద్దతు ప్రకటించారు. విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాలకృష్ణ ఫ్యాన్స్ టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి గణబాబుకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ విజయాల పోస్టర్‌ను గణబాబు సమక్షంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు నారిపిన్ని సత్తిరాజు, కంపర ఆనంద్, మళ్ల రమేష్, కనకకుమార్, నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు నమ్మి సన్నిబాబుయాదవ్, పి.వినోద్‌రెడ్డి, డి.ఎ.రాజు, ఎస్.కల్యాణ్, చిన్న అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'పశ్చిమ' నుంచి విమలను గెలిపించండి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న జెవి.సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఇండియా ఫోరం తరపున పోటీ చేస్తున్న సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమలను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి కోరారు. బుచ్చిరాజుపాలెంలో మంగళవారం అత్తిలి విమల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఇండియా ఫోరమ్ అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారం చేపట్టిన తరువాత వాటిని విస్మరించి పరిపాలన సాగించాయని విమర్శించారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, కులాల మధ్య గొడవలు సృష్టించి పరిపాలన చేస్తోందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి అరాచకత్వానికి, రాష్ట్రంలోని వైసిపి నియంతపాలనకు చమరగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. ప్రత్యామ్నాయంగా ఏర్పడ్డ ఇండియా ఫోరమ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పశ్చిమ నియోజకవర్గ సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల మాట్లాడుతూ, చట్టసభల్లో సరైన అవకాశాలు లేక మహిళల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఎన్నికల సమయంలో మహిళలను ఓటు బ్యాంకుగా చూస్తున్న బూర్జువా రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలంటే అధిక సంఖ్యలో మహిళలను చట్టసభలకు పంపాలని కోరారు. తనను గెలిపిస్తే పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తానన్నారు. ఈ ఎన్నికల్లో కంకి కొడవలి గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామాంజనేయులు, ఎం.పైడిరాజు, కొసిరెడ్డి సత్యనారాయణ, జిఎస్‌జె అచ్యుతరావు, పి.చంద్రశేఖర్, ఎం.శ్రీనివాసరావు, ఎం.ఎ.బేగం, కె.వనజాక్షి, ఎస్‌కె.రెహమాన్, సిఎస్.క్షేత్రపాల్, బి.పుష్పలత పాల్గొన్నారు.

రాంజీ ఎస్టేట్‌లో అన్నసమారాధన

ప్రజాశక్తి-సీతమ్మధార : నూకాంబిక అమ్మవారు పండుగను పురస్కరించుకుని 47వార్డు రాంజీ ఎస్టేట్‌లో అన్న సమారాధన నిర్వహించారు. అన్న సమారాధనలో ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, వసంతల అప్పారావు, సుకుమార్, విజయ్, సాయి, సురేష్, జాయ్, ముక్క రమణ, బోగీ, నాగరాజు, కనకరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కవితా గోష్ఠి

సీతమ్మధార : అఖిల భారతీయ సాహిత్య పరిషత్ నిర్వహణలో బివికె కళాశాల భువన విజయం వేదికపై కవితా గోష్ఠి నిర్వహించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ విశ్రాంత చీఫ్ జనరల్ మేనేజర్ పిఎస్.కుమార్ ఉగాది గురించి వివరించారు. గౌరవ అతిథి డాక్టర్ ఎం.విజయ గోపాల్ సాహిత్యంలో జాతీయ దృక్పథం ఆవశ్యకతను తెలిపారు. కవితా గోష్ఠిలో దామరాజు విశాలాక్షి, డాక్టర్ కెవిఎస్ మూర్తి, సి.హెచ్.నిర్మల, కుప్పిలి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న రమాకుమారి

ఘనంగా పెద్దింటి అమ్మవారి జాతర

ప్రజాశక్తి -ములగాడ : ఉగాది వేడుకలను పురస్కరించుకొని పారిశ్రామిక ప్రాంతం మల్కాపురంలో మజ్జి సోమేష్ ఆధ్వర్యాన పెద్దింటి అమ్మవారి జాతర వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఎలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రమాకుమారి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరాల సంఘం కుల పెద్దలు పాల్గొన్నారు.

అవినీతిపరులతో పోరాటం చేస్తున్నాం : పల్లా

ప్రజాశక్తి -గాజువాక : ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని దోచుకున్న అవినీతిపరులతో పోరాటం చేస్తున్నామని గాజువాక కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఉగాది సంబరాలు నిర్వహించారు. వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, గాజువాకలో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంధం వెంకట్రావు, కరణం కనకారావు, కార్పొరేటర్లు బొండా జగన్, పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, జనసేన నాయకులు రౌతు గోవిందరావు, గవర సోమశేఖర్, విందుల రమణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రేవిడి ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్ జోన్ 3 ఎఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. 33/ కెవి 11 రేవిడి ఫీడర్ పరిధిలో ఉన్న పాండ్రంగి, రేవిడి, బర్లపేట, కొండబార్లపేట, కోరపల్లి గ్రామాల్లో విద్యుత్తు లైన్ల మరమ్మతులు, చెట్లు నరికివేత పనుల నేపథ్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

★ గ్యాస్ సిలిండర్ పేలడంతో చుట్టూ ఉన్న సోలార్ ప్యానల్స్ ధ్వంసం
★ రూ.5.25 లక్షలకు పైబడి ఆస్తి నష్టం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రం దేవరాపల్లిలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో జల్లూరు శేషారావుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఇంటిలో ఉన్న రూ.25 వేల నగదుతో పాటు వంట సామాగ్రి, బట్టలు, గృహోపకరణాలు ఖాళీ బూడిదయ్యాయి. దీంతో సుమారు లక్ష 50 వేల రూపాయలు నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. మంటకు ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో చుట్టుపక్కల ఉన్న సోలార్ ప్యానల్స్ ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఇరుపక్కల ఉన్న గుల్లిపల్లి మురళీకృష్ణ చెందిన 10 సోలార్ ప్యానల్స్, గుల్లిపల్లి సన్యాసినాయుడుకు చెందిన నాలుగు సోలార్ ప్యానల్స్ దెబ్బతిన్నాయి. సుమారు 3 లక్షల 75 వేల రూపాయలు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సంఘటన స్థలానికి స్థానిక విఆర్ఓ బి.నాగేశ్వరరావు వెళ్లి ప్రమాదం నష్టాన్ని, జరిగిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

కాలిపోయిన పూరింటి వద్ద బాధితులు శేషారావు దంపతులు

తారు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ధర్మశ్రీ సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి- చోడవరం

చోడవరం పట్టణ పరిధిలోని స్థానిక డిగ్రీ కళాశాల నుంచి నరసయ్యపేట వరకు సుమారు 90 లక్షల రూపాయల వ్యయంతో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన సొంత నిధులతో యుద్ధ ప్రాతిపదికన తారురోడ్డు నిర్మాణాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ఇప్పటివరకు సొంత నిధులతో రోడ్డు నిర్మాణాలు చేపట్టిన నాయకులుగాని, ప్రజా ప్రతినిధులుగాని లేరని తెలిపారు. తెలుగుదేశం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా నిలిచిపోయిన ఈ రోడ్డును ఎలాగైనా నిర్మించాలన్న పట్టుదలతో నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కేవలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని చోడవరం నియోజకవర్గంలో ఓడించాలన్న ఉద్దేశంతోనే తెలుగుదేశం పార్టీకి చెందిన కాంట్రాక్టర్ ఈ రోడ్డు నిర్మాణాన్ని నిలుపు చేశారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు. ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉండడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో సొంత నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీకాంత్, ఎంపిపి గాడి కాసు, నర్సయ్యపేట, గాంధీ గ్రామం సర్పంచ్‌లు మమ్మినా నాగేశ్వరరావు, గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.

కశింకోట : కశింకోటలోని నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు బుదిరెడ్డి చిన్న, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీను, వేగి రామకోటి, కాంగ్రేసులు సతీష్, తాకాశి కృష్ణ, కర్రి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసింగబిల్లిలోని నూకాంబిక అమ్మవారిని టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నకర్ దర్శించుకున్నారు ఈ కార్య క్రమం లో కొన వెంకట సత్య నారాయణ, అందే రమణ, కొన రమణ పాల్గొన్నారు.


కశింకోట నూకాంబిక ఆలయాన్ని దర్శించుకున్న కొణతాల, పీలా తదితరులు

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల శ్రీగౌరీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల్లో భాగంగా గత నెల మూడో తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన అనకాపల్లి మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను మంగళవారం ప్రదానం చేశారు. ఈ పరీక్షలో 360 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి దిబ్బపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి దేదీప్యకు రూ.5000 నగదు, జ్ఞాపిక, ద్వితీయ బహుమతి కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ హర్షవర్ధన్‌కు రూ.3000 నగదు జ్ఞాపిక, తృతీయ బహుమతి సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్ జాహ్నవికి రూ.2000 జ్ఞాపికను ముఖ్య అతిథిగా హాజరైన అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ ఏడి రవిబాబు చేతుల మీదుగా అందజేశారు. మండల స్థాయి 10వ తరగతి పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన యం.దిలీప్ అఖిల్ కుమార్ (తుమ్మపాల), ఆర్.హేమంత్ (సీతానగరం), టి.సౌజన్య (తారక రామ కాలనీ), ఏ.జయ కుమార్ (కూండ్రం), ఎం.పూజిత (దిబ్బపాలెం), బి.లావణ్య (చింత నిప్పుల అగ్రహారం), ఏ.శరణ్య (క.కొప్పాక), బి.మౌనిక (మామిడిపాలెం), జి.గౌతం (కొండుపాలెం), ఏ.దివాకర్ (మార్టూరు)కు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఆడారి నారాయణమూర్తి, గౌరవ అధ్యక్షులు శ్రీరాపేటి నాగేశ్వరరావు, ఆళ్ళ గోవిందరావు, బుచ్చియపేట మండల విద్యాశాఖాధికారి బుద్ధ కాశీ, కొణతాల నరసింహరావు, మళ్ల శ్రీనివాస్, పీలా నారాయణ రావు, బి.కె.వి.గోవిందరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతామణి గణపతిని దర్శించుకున్న కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం సిరసపల్లి శ్రీచింతామణి గణపతి స్వామిని జనసేన పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మంగళవారం దర్శించుకున్నారు. చింతామణి గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. దత్త క్షేత్రాన్ని సందర్శించి అక్కడున్న భక్తులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట టిడిపి నాయకులు మాదంశెట్టి నీలబాబు, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా ఎల్లారమ్మ జాతర

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల గ్రామంలో మంగళవారం ఎల్లారమ్మ జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అందాలపల్లి, కొండకర్ల, చీమలపల్లి, హరిపాలెం, ఎర్రవరం తదితర గ్రామాలకు చెందిన అనేకమంది భక్తులు తరలివచ్చి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పలు పార్టీల్లో చేరికలు


టిడిపి చేరిన వారిని అభినందిస్తున్న పైలా ప్రసాదరావు

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి గ్రామంలో వైసిపి నుంచి ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెనగంటి సింహాచలంనాయుడు, వార్డ్ మెంబర్ దొగ్గ శ్రీరామ్, నాయకులు దొగ్గ అప్పలనాయుడు, గవిరెడ్డి ఎర్నాయుడు, ఎలిశెట్టి పార్వతీరావు, పెనగంటి కన్నంనాయుడు, పెనగంటి నారాయణరావు తదితరులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కూటమి మాడుగుల నియోజకవర్గం అభ్యర్థి పైలా ప్రసాదరావు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా టీడీపీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎలిశెట్టి పాత్రుడు, బుదిరెడ్డ బాబూరావు, మళ్ళా ప్రసాద్, కోటాన అప్పారావు, పిన్నింటి ఈశ్వరరావు, ద్వారపరెడ్డి అప్పారావు సేశెట్టి కోటేశ్వరరావు, బుదిరెడ్డ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి రాజు సమక్షంలో టిడిపి చేరిన దృశ్యం

గ్రామ వాలంటీరు, వైసిపి గృహ సారథులు చేరిక

బుచ్చెయ్యపేట : మండలంలోని ఆర్ భీమవరం గ్రామానికి చెందిన పలువురు వైసిపి గృహసారథులు, గ్రామ వాలంటీర్, వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు మంగళవారం స్థానిక మాజీ సర్పంచ్ మలిరెడ్డి బుజ్జి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, నియోజకవర్గం ఇంచార్జ్ బత్తుల తాతయ్య బాబు తదితరులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో ఆర్.భీమవరం మాజీ సర్పంచ్, సచివాలయ కన్వీనర్ రొంగలి చిన్నమనాయుడు, గ్రామ వాలంటీర్ కొండ్రపు పాపారావు, గృహ సారథులు పల్లి సన్నిబాబు, అన్నిటి నాగేశ్వరరావు, కోండ్రపు అప్పలనాయుడు, రెడ్డి గోవిందా తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, దొంకన అప్పలనాయుడు, కోరుకొండ రవికుమార్, సాయం శేషు, ఎంవివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

అచ్యుతాపురం : ఎలమంచిలి నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు మంగళవారం అచ్చుతాపురం జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో ఆ పార్టీలు చేరారు. అచ్యుతాపురం మండలం చీమలపల్లి పంచాయతీ అప్పన్నపాలెం గ్రామానికి చెందిన మాజీ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి నాయుడు, రెడ్డి నూకరాజు, వారి అనుచరులు, మల్లవరం పంచాయతీ నరేంద్రపురం గ్రామం నుంచి సీనియర్ నాయకులు రావి నాయుడు, వార్డు సభ్యులు దూళి చిలుకునాయుడు, 30 మంది కార్యకర్తలు, ఉప్పవరం పంచాయతీ నుంచి సుమారు 20 మంది పైచిలుకు అధికార పార్టీ కార్యకర్తలు, ఎలమంచిలి రూరల్ అధ్యక్షులు అన్నం బాబ్జి ఆధ్వర్యంలో ఎలమంచిలి మండలం లక్కవరం, తరంగాల పాలెం గ్రామాలకు చెందిన 30 మంది జనసేన పార్టీలో చేరారు. వారికి విజయ్ కుమార్ చేతుల మీదుగా కండువాలు వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా సీఎం రమేష్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు ద్వారపురెడ్డి బాబ్జీ, డ్రీమ్స్ నాయుడు, కరెడ్ల సూర్యప్రకాష్, కుండ్రపు రమణ, నగిరెడ్డి నాగేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జనసేన కండువాలు వేస్తున్న సుందరపు విజయ్‌కుమార్

ఎమ్మెల్యే కన్నబాబురాజు సమక్షంలో వైసిపిలో చేరిన దృశ్యం

వైసిపిలో చేరిన టిడిపి కార్యకర్తలు

అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక శివారు జాలరిపాలెం గ్రామంలో వైసిపికి చెందిన మత్స్యకారులు మంగళవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కన్నబాబు రాజు పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ పాలనలో మత్స్యకారులకు న్యాయం జరుగుతుందన్నారు. పూడిమడకలో జెట్టి నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని చెప్పారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసుపల్లి శ్రీనివాసరావు, కాసారపు బాలరాజు, జ్యోతి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి రెబల్ అభ్యర్థి వెంకట నరసింహారావు

ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రతి గ్రామానికి ఆర్ఒ ప్లాంట్

ప్రజాశక్తి - పరవాడ

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తన సొంత నిధులతో పెందుర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి, తాగునీటి సౌకర్యం కల్పిస్తానని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థి, విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావు అన్నారు. మండలంలోని లంకెలపాలెం గ్రామంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూజా ప్రాజెక్టుకు లారీల ద్వారా తరలిస్తున్న బొగ్గు సమస్యను పరిష్కరిస్తానన్నారు. తాడి గ్రామ తరలింపునకు కృషి చేస్తానని చెప్పారు. పంచ గ్రామాల సమస్యను పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా సీతారాముల పెళ్లి రాట మహోత్సవం

ప్రజాశక్తి-మునగపాక

మండలంలోని గణపర్తి గ్రామంలో సీతారాముల పెళ్లి రాట మహోత్సవం మంగళవారం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలలో భాగంగా సీతారాముల కల్యాణానికి సంబంధించి ఉగాది రోజున రాట కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీగా వస్తుందని సర్పంచ్ చదరం గణేష్ నాయుడు పేర్కొన్నారు. 17న జరిగే శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా కోలాటం, తప్పెడగుళ్ళు, సేవ గరిడి వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కర్రి ధారబాబు, ఎల్లపు శంకర్, ఆడారి వెంకటరమణ, చదరం సత్తిబాబు, వెలగా దారనాయుడు, కలగా రమణ, మహిళలు పాల్గొన్నారు.

కల్యాణ రాట వేస్తున్న గణపర్తి గ్రామస్తులు

రామాలయంలో కలశ పూజలు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని ఆరిపాక పంచాయితీ శివారు పెదయాతపాలెం గ్రామంలో శ్రీకోదండ సీతారామాలయంలో ఉగాదిని పురస్కరించుకొని మంగళవారం కలశ పూజలు నిర్వహించారు. ఉగాది నుండి ఈ నెల 17న శ్రీరామ నవమి వరకు నిత్యం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీలక్ష్మిరాణి రాము దంపతులు, రాపేటి రమేష్ సీతాలక్ష్మి దంపతులు, శరగడం వెంకట శ్రీనివాస్ లక్ష్మీ దంపతులు, ఆరిపాక ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న పెదయాతపాలెం గ్రామస్తులు

ఘనంగా ఉగాది వేడుకలు

పలు చోట్ల పంచాంగ శ్రవణం

టిడిపి అనకాపల్లి జిల్లా కార్యాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

తెలుగు సంవత్సరాది శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం చేశారు.

అనకాపల్లి : స్థానిక రింగురోడ్డులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీష్ ఆధ్వర్యాన ప్రముఖ సిద్ధాంతి బంకుపల్లి సత్యనారాయణ పంచాగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, బోడి వెంకటరావు, బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, ఎస్ఎఫ్ఎ సత్యనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ పాల్గొన్నారు. కార్యకర్తలకు అభిమానులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సాయినాట్య భారతి అకాడమీ భాగవతుల శిరీష రాణి బృందం చిన్నారులు కూచిపూడి జానపద నృత్యాలతో ఆహూతులను అలరించారు. బిజెపి కార్యాలయంలో ఉమ్మడి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కుటుంబ సభ్యులతో సహా పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. జార్జ్ క్లబ్ యోగ సభ్యుల ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో పతాంజలి యోగ సమితి తెలుగు రాష్ట్రాల యువజన అధ్యక్షులు స్వామి అశోక్ ఆర్య, క్లబ్ ప్రతినిధులు పెంటకోట సుబ్రహ్మణ్యం, బిఎస్ఎంకె జోగి నాయడు తదితరులు పాల్గొన్నారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని అందరికీ అందజేశారు.

అచ్యుతాపురం : మండలంలోని పలుగ్రామాలలో పంచాంగ శ్రవణం వేద పండితులు చదివి వినిపించారు. క్రోధ నామ సంవత్సరంలో జరిగే లాభనష్టంలు మంచి చెడ్డలు వాటి గురించి తెలియజేశారు. ఉగాది పచ్చడిని రామాలయాలలో పంపిణీ చేశారు. మండల కేంద్రమైన అచ్యుతాపురం అయ్యప్ప స్వామి ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా పూజలు చేశారు.

మునగపాక : మండలంలో పలు గ్రామాల్లో ఉగాది సందర్భంగా నూతన వస్త్రధారణ, ఇంటి ముంగిళ్ళు మామిడాకుల తోరణాలు, రంగురంగుల ముగ్గులతో శోభాయ మానంగా కనువిందు చేశాయి. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, తీపి వంటకాలు ఆరగించి కుటుంబ సమేతంగా ఉగాది పండుగను జరుపుకున్నారు. పంచాంగ శ్రవణం వినేందుకు దేవాలయాలు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి రామాలయంలో మంగళవారం ఉగాదిని పురస్కరించుకొని పంచాంగ శ్రావణం జరిగింది. రామాలయ అర్చకులు లక్ష్మిపతి శర్మ ఈ ఏడాదిలో గ్రామదేవతల గ్రహ స్థితులు, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కిలపర్తి భాస్కరరావు, లలితా నాయుడు, గండిపడాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గొంతున శ్రీనివాసరావును పలువురు నాయకులు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో మాజీ సర్పంచ్ కర్రి దుర్గ నాయడు, నైనం శెట్టి రమణ రావు, ఉలింగల రమేష్ , జెర్రి పోతులు నూకి నాయడు వున్నారు.

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వచ్చి ఎమ్మెల్యే గణేష్‌ను కలిశారు. 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, బాల వినాయక దేవస్థానం చైర్మన్ దేవత అరుణ, ఎమ్మెల్యే గణేష్‌కు మిఠాయిలు తినిపించి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ చోటి, మాకవరపాలెం మండల పార్టీ అధ్యక్షుడు రుత్తల వాసు, సీనియర్ వైసీపీ నాయకులు పెట్ల భద్రాచలం, కోల ఈశ్వరరావు, ఏకాశివ, తమరాన శ్రీనివాస్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.

మధురవాడ : ఎండాడలోని వైసిపి కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు సమక్షంలో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ జరిగింది. వైసిపి సాంస్కృతిక విభాగం జోనల్ ఇంచార్జ్ వంకాయల మారుతీ ప్రసాద్ ఆధ్వర్యాన జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నాయకులు జి.రవిరెడ్డి, పేడాడ రమణికుమారి, నడింపల్లి కృష్ణంరాజు, బోని శివరామకృష్ణ, కె.రామన్నపాత్రుడు, యువశ్రీ, రాధ, పోతిన శ్రీను, అప్పన్న, జగ్గుపల్లి నరేష్, మధుసంపతి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలోని మా మీడియా హబ్‌లో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ అధ్యక్షతన సంబరాలు నిర్వహించారు. సిఐ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై స్వీట్లు పంపిణీచేశారు.

పద్మనాభం : మండలంలోని 22 గ్రామపంచాయతీలో ఆయా గ్రామాల రచ్చబండల వద్ద పంచాంగ శ్రవణాన్ని గ్రామ పురోహితులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి తయారుచేసి వచ్చిన వారందరికీ పంపిణీ చేశారు. మద్ది, వికె.పాలెం, పాండ్రంగి, రేవిడి, పద్మనాభం, కృష్ణాపురం, రెడ్డిపల్లి, తునివలస, చెన్నాపురం, అయినాడ, బి.తాళ్లవలస, బుడ్డివలస, కోరాడ, అనంతవరం, గన్నవరం గ్రామాల్లో పంచాంగ శ్రవణం చేశారు. పాండ్రంగి గ్రామంలో మాజీమంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు, రాజుల సామాజిక వర్గం కలిసి ఆయన ఇంట్లోనే పంచాంగ శ్రవణం చేయించారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు పాండ్రంగి గ్రామంలో వీధిలో పంచాంగ శ్రవణం చేశారు. కృష్ణాపురం, రెడ్డిపల్లి, అనంతవరం, వికెపాలెం రామాలయాలు వద్ద పంచాంగ శ్రవణం పురోహితులు వినిపించారు.

సీతమ్మధార : బాలయ్య శాస్త్రి లే-అవుట్ వద్దనున్న వైసిపి ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు, విద్యార్థులు అందరికీ మంచి జరిగి ప్రజలు సుభిక్షంగా ఉండాలని నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ఉగాది పర్వదినాన ఉత్తరాంధ్ర ద్రోహులను ఓటు హక్కుతో తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకట్రావు, విఎంఆర్‌డిఎ చైర్మన్ సనపల చంద్రమౌళి, డాక్టర్ రమణమూర్తి, సీనియర్ నాయకులు జి.వి.రవిరాజు, వుండా రవి, కాశీ విశ్వనాథం, సతీష్ వర్మ, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, బాణాల శ్రీనివాస రావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ కంపా హనుక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహిళలు

గాజువాక: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గాజువాక నియోజకవర్గం ఎన్నికల కార్యాలయంలో మంగళవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. పండితులు కామేశ్వర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ట్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు, మొల్లి చిన్న యాదవ్, మంత్రి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం వైసిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ బాబాను దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టు చైర్మన్ వానపల్లి అప్పారావు స్వాగతం పలికారు. ఆలయం పురోహితులు నగేష్ శర్మ పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ పాత్రో, వానపల్లి అప్పారావు పాల్గొన్నారు.

హష్మి భవనంలో ఉగాది సంబరాలు...

కరాస : స్థానిక జివిఎంసి 52వ వార్డు పరిధి శాంతినగర్‌లోని హష్మి భవనంలో మంగళవారం సాయంత్రం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు రమణ, అరుణ్‌జీ హాజరై అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రజా నాట్యమండలి కళాకారులచే ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దష్ట్యా, ప్రజలను చైతన్య పరిచే గేయాలు, దేశ గీతాలు అలరించారు. నృత్య కళాకారిణి పద్మరాగిణి విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

10 ఎకరాల్లో యూకలిప్టస్, సరుగుడు తోటలు దగ్ధం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం తైపురం రెవెన్యూ పరిధిలో కప్పలబంద చెరువు వద్ద మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 10 ఎకరాల్లో ఉన్న యూకలిప్టస్, సరిగుడు తోటలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన సీతా రమణేశ్వరరావు, డేగల రమణ, డేగల గంగరాజు, డేగల నూకరత్నం, ముచ్చకర్ల సత్యవతి, సీతా ఎర్రి నాయుడు, ఉల్లింగల అప్పారావు, ఉల్లింగల నూకరాజు, డేగల అచ్చిం నాయుడు తదితరులకు చెందిన 2 ఎకరాల్లో గల యుకలిప్టాస్, 8 ఎకరాల్లో గల సరుగుడు తోటలు పూర్తిగా కాలిపోయాయి. తోటల్లో మంటలు రావడాన్ని సమీపం పంట పొలాల్లో ఉన్న పలువురు రైతులు గమనించి మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంలో సుమారు అయిదు లక్షల రూపాయలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను కోరారు.

సరుగుడు తోటలో మంటలు ఆర్పుతున్న బాధిత రైతు

తడపర్తి, శ్రీరాంపురం రోడ్డు పూర్తయ్యేదెన్నడో?

● అటవీశాఖ అభ్యంతరంతో నిలిచిన పనులు ● ప్రజల కష్టాలు పట్టించుకోని అధికారులు, నేతలు

ఏళ్ల తరబడి అసంపూర్తిగా శ్రీరాంపురం రోడ్డు

ప్రజాశక్తి -కోటవురట్ల: దశాబ్ద కాలంగా అసంపూర్తిగా వదిలేసిన తడపర్తి శ్రీరాంపురం రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామంలో గిరిజనులు ఆందోళన నిర్వహించారు, నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు కోట్ల నిధులతో 5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభించగా, 2కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు, అయితే మిగతా 3 కిలోమీటర్లు రోడ్డు నిర్మించాల్సి ఉండగా అటవీ శాఖ అభ్యంతరంతో పనులు నిలిపివేశారు. అటవీశాఖ భూముల్లో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఆశాఖ అధికారులు అభ్యంతర వ్యక్తం చేయగా, వాస్తవానికి కేవలం 1.50 కిలోమీటర్లు మాత్రమే అటవీ ప్రాంతం భూమి ఉందని ఆ ప్రాంతానికి చెందిన గిరిజనులు వాపోతున్నారు, గతంలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా ఎవరు పట్టించుకోలేదన్నారు. రోడ్డు నిర్మాణం మధ్యలో ఆగిపోవడంతో బోయినకొత్తూరు, తాడపర్తి, శ్రీరాంపురం, ఆక్సెపేట, గిరిజన గ్రామంలోకి వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు కూడా అందడం లేదని, రైతులు తమ పంట ఉత్పత్తులు విక్రయించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రజల కష్టాలు పట్టించుకోరు...

రోడ్డు నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ ఉత్పత్తులు అమ్మకానికి తీసుకెళ్లా లన్నా, అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ రావాలన్న ఇబ్బందులు తప్పడం లేదు.

గంచిమల్ల పాప, మాజీ సర్పంచ్

ప్రజా ప్రయోజనం గాలికి...

గిరిజన గ్రామాల ప్రజల సౌకర్యం కోసం రోడ్డు నిర్మాణం చేపడితే, అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేయడం, ఏళ్ల తరబడి రోడ్డు పనులు నిలిచిపోవడం దుర్మార్గం. ప్రజాప్రయోజనం కన్నా ఫారెస్ట్ అధికారులకు భూమి ముఖ్యమా? సమస్య పరిష్కారానికి అధికారులు, నేతలు చొరవ చూపకపోవడం మరీ దారుణం. తక్షణమే ప్రభుత్వం స్పందించి రోడ్ నిర్మాణం చేపట్టాలి.

మిరపల వెంకటరమణ, స్థానికులు

రోడ్డు పునర్నిర్మాణంపై హర్షం

నిర్మాణం పూర్తయిన రావికమతం, కవగుంట రోడ్డు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : మండల కేంద్రం రావికమతం నుంచి కింతలి వెళ్లే తారురోడ్డు పునర్నిర్మాణ పనులు పూర్తి కావడంపై రావికమతం, చినపాచీల, కొమ్మెర, కేబిపీ అగ్రహారం, గుమ్మాలపాడు, కవగుంట, ఎర్రబంద ,బుడ్డి బంద,పెదపాచీల, తదితర గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాడుగుల, రావికమతం మండలాలకు ప్రధాన రహదారి అయిన ఈ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలకు కొన్నేల్లుగా ప్రజలు నానా ఇబ్బందులకు గురాయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు, ప్రజలు రహదారి సమస్యను ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లగా, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడమే కాక, పునరిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. రావికమతం మండల కేంద్రం నుంచి మండల శివారు గ్రామమైన కవగుంట వరకు సుమారు 7 కిలోమీటర్ల రోడ్డును రూ.రెండు కోట్లతో పునర్నిర్మాణ పనులు పూర్తి చేయించిన ఎమ్మెల్యే ధర్మశ్రీకి స్థానికుల ధన్యవాదాలు తెలుపుతున్నారు. కవగుంట, కెబిపి. అగ్రహారం, కొమిర, చినపాచిల, గుమ్మాలపాడు, రావికమతం గ్రామాల సర్పంచులు దాసరి సూర్యకుమారి, కలిగిరి ప్రసాద్, కొమార ప్రసాదు, గొర్ల రవికుమార్ బంటు సన్యాసిరాయుడు, ఎంపీటీసీ బంటు శ్రీనివాసరావు, ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఉన్నారు..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2004-05 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులంతా ఇరవై ఏళ్ల తర్వాత తమకు విద్యాబుద్ధులు నేర్పిన వేంపాడు పాఠశాల వేదికగా మంగళవారంఉగాది రోజున కలుసుకున్నారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను, చేదు అనుభవాలను ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకున్నారు. చిన్నతనంలో చేసిన అల్లరి, ఆడిన ఆటలు, గురువులు బోధించే తీరు అన్నీ ఒకసారి నెమరువేసుకుంటూ జ్ఞప్తి తెచ్చుకున్నారు. తామంతా ఎప్పటికీ కలిసి ఉంటూ , ఒకరికొకరు అండగా నిలవాలని, ఇకనుంచి ప్రతిఏటా అంతా కలవాలని నిర్ణయం తీసుకున్నారు.పేద విద్యార్థులకు ఏటా సహాయం అందించాలని నిర్ణయం తీసుకున్నారు . పాఠశాలలో ఉదయం నుండి సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ సంతోషంగా గడిపారు.

ఆరేళ్లుగా ఆగి, సాగుతున్న రోడ్డు నిర్మాణం

● అరకొరగానే పనులు చేసి వదిలేస్తున్న కాంట్రాక్టర్లు

● ప్రజల కష్టాలు పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి- రోలుగుంట : మండలంలో ఎంకె.పట్నం నుండి బిబి.పట్నం మీదుగా రత్నంపేట వెళ్లే సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి పనులు ఆరేళ్లుగా నిధులు మంజూరు అయినా గుత్తేదారులు చేతులెత్తేడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆయా మూడు గ్రామాల ప్రజలకు ఎదురుపడితే త్వరలో రోడ్డు పనులు పూర్తవుతాయని తప్పించుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గొలుగొండ మండలం ఏటిగైరంపేట ఆర్అండ్‌బి రద్దు నుడి ఎంకె.పట్నం, బిబి.పట్నం మీదుగా రత్నంపేట నుండి వడ్డిప వరకు ఉన్న రహదారికి 2018లో అప్పటి ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో బిటి రోడ్డునకు నిధులు మంజూరు చేశారు. గుత్తేదారుడు పనులు ప్రారంభించి ఒక లేయరు(పరుపు) వేయడం జరిగింది. ఈలోగా 2019 ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపివేశారు. తదనంతరం వైసిపి ప్రభుత్వం వచ్చాక గుత్తేదారుడు పనులు ప్రారంభించలేదు. దీంతో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మళ్లీ నిధులు మంజూరు చేయించారు. గుత్తేదారుడు పనులు ప్రారంభించి మళ్లీ నాలుగు కిలో మీటర్లు ఒక లేయరు వేయడం జరిగింది. కొన్ని కల్వర్టులు నిర్మాణం జరిగింది. ఇంకొ కొన్ని కల్వర్టులు పూర్తి కాలేదు. మెటీరియల్ పిక్కి ఇసుక బిబి.పట్నం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో వేశారు. గుత్తేదారుడు మళ్లీ చేతులెత్తేశాడు. ఆరు నెలల క్రితం మళ్లీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ రూ.కోటి 30లక్షలు నిధులు మంజూరు చేయించారు. కానీ ప్రారంభించలేదు. గతేడాది నవంబర్ నెలలో కురిసిన వర్షాలకు మళ్లీ రహదారి గోతుమయంగా మారడంతో ఆయా మూడు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలన్న నర్సీపట్నం వెళ్లాలన్నా నానా ఇబ్బందులు పడుతున్నారు. పనులు ప్రారంభించుటకు ముస్తాబు చేయుట తప్పా గుత్తేదారుడు ఎవరు ముందుకు రాకపోవడంతో ఈ ఐదేళ్లు పనులు సాగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.

అరకొర పనులతో నిలిచిన రోడ్డు

23న మరిడమ్మ పండగ

అందరూ సహకరించాలి : అయ్యన్నపాత్రుడు

మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : మరిడమ్మ పండుగను విజయవంతానికి అందరూ సహకరించాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం నర్సీపట్నంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పూర్వకుల నుంచి ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో పండుగను ఆపివేయడం మంచిది కాదన్నారు. కానీ పండుగను నిబంధనలు పాటిస్తూ కచ్చితంగా చేస్తామన్నారు. పండుగను రాజకీయ కోణంలో చూడకుండా అందరూ సహకరించాలన్నారు. ఈ నెల 15న గరగలు తీయడం, 22 రాత్రి పెదజాగారం, 23 పండుగ జరగనుందని తెలిపారు.. తాను ఎన్నికల పోటీలో ఉండటం వల్ల ఈ బాధ్యతను కమిటీ సభ్యులు తీసుకోవాలన్నారు.రెండేళ్ల క్రితం మరిడమ్మ గుడి దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లిపోయిందన్నారు. ఆదాయం లేని ఈ ఆలయాన్ని దేవాదాయశాఖ ఆదీనంలోకి తీసుకురావడం దారుణమన్నారు. పండుగ నేపథ్యంలో అమ్మవారి ఆభరణాలు ఇవ్వకపోతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలోని దండి సురవరం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గండిమ వెంకట సూరి అప్పారావు, బత్తిన గంగరాజులకు చెందిన రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.ఈ ప్రమాదంలో. వెంకట సూరి అప్పారావు ఇంట్లోని రూ.2 లక్షల 70 వేల నగదు, 6 తులాల బంగారం, గంగరాజు ఇంట్లో రూ.70 వేల నగదు తో పాటు సుమారు టన్ను ధాన్యం, రెండు బస్తాల మినుములు, పిల్లల పుస్తకాలు, ట్యాబ్‌లు, ఇతరత్రా సర్వం కాలి బూడిదైందనిబాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక రెవెన్యూ సిబ్బంది ప్రమాదం కారణాలు, ఆస్థి నష్టంపై అంచనాలు వేసి తహశీల్దార్‌కు నివేదించినట్లు తెలిపారు.

బాధితులను పరామర్శిస్తున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పరామర్శ

దండి సురవరంలో అగ్నిప్రమాద సమాచారం తెలుసుకున్న మాడుగుల నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ప్రమాదస్థలికి చేరుకొని బాధితులను పరామర్శించారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి, బాధితులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అధికారులను కోరారు. మండల పార్టీ అధ్యక్షులు గొల్లవెల్లి రాజబాబు, గ్రామసర్పంచ్ కోన అర్జున, పలువురు నాయకులు కురచా నారాయణమూర్తి, ధర్మ శెట్టి కొండబాబు కార్యకర్తలు ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి--రాజవొమ్మంగి : మండలంలోని కింద్ర జంక్షన్ వద్ద రాజవొమ్మంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా వాహన తనిఖీలు చేపట్టారు. కారులు, ఇతర వాహనాల డిక్కీలు తనిఖీ చేశారు. నగదు, సారాయి, మద్యం, గంజాయి, మారక ద్రవ్యాలు అక్రమ రవాణా నివారించడంలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

- సచివాలయ సిబ్బంది చొరవపై ప్రశంసలు

వికలాంగ బాలింతకు పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రసవానికి ఆసుపత్రిలో చేరిన వికలాంగ లబ్ధిదారుకు నక్కపల్లి సచివాలయ ఉద్యోగులు ఆసుపత్రికి వెళ్లి పింఛనుఅందజేశారు. నక్కపల్లి సచివాలయం పరిధిలో తిరుపతమ్మ అనే వికలాంగురాలు అనకాపల్లి వంద పడకల ఆసుపత్రిలో డెలివరీ కోసం వారం రోజుల క్రితం చేరారు. ఈనెల సచివాలయంలోనే పింఛను పంపిణీ చేపట్టగా, ఆసుపత్రిలో ఉన్న తిరుపతమ్మ పింఛన్ తీసుకోవడానికి రాలేకపోయింది. విషయం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది, పింఛన్ల బట్వాడాకు ప్రభుత్వమిచ్చిన గడువు ముగిసిపోతుండడంతో ఆసుపత్రిలో ఉన్న తిరుపతమ్మకు పింఛను అందజేయాలని భావించారు. నక్కపల్లి సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.వెంకటేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ జి.గణేష్ సోమవారం రాత్రి అనకాపల్లి వెళ్లి ఆసుపత్రిలో ఉన్న తిరుపతమ్మకు పింఛను నగదు అందజేశారు. మగ బిడ్డకు జన్మనిచ్చిన ఆమెకు శు భాకాంక్షలు తెలిపారు. కాగా సచివాలయ సిబ్బంది చొరవను లబ్ధిదారు కుటుంబ సభ్యులు, మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్, ఎంపిడిఒ శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, ఎఒ సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు వెంకటేష్,గణేష్ లను అభినందించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

రోడ్డుపైనే బైక్‌ల పార్కింగ్

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రధాన రహదారిని అనుకొని ఉన్న షాపులకు ఎదురుగా పార్కింగ్ స్థలం లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది, దీంతో ప్రధాన రహదారిపై వాహనాలు నిలపడంతోపాటు దుకాణదారులు వారి దుకాణం బోర్డులు రోడ్ల మార్జిన్ పై ఉంచడంతో పలుమార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి, పోలీసు అధికారులు స్పందించి మండల కేంద్రంలో కూడళ్ళ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు స్థానికులు కోరుకుంటున్నారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి -నక్కపల్లి :ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయం మంగళవారం ఉగాది పర్వదినం పురస్కరించుకుని భక్తుల రద్దీతో కిటకిటలాడింది తెల్లవారుజాము నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఆలయంలో ఉగాది ఆస్థానంలో భాగంగా ప్రముఖ వేద పండితురాలు డాక్టర్ గాయత్రీ దేవి పంచాంగ శ్రవణం నిర్వహించారు.

క్యూలైన్లలో వేచియున్న భక్తులు

అలంకారప్రాయం

- నిరుపయోగంగా పాతగొట్టువాడ డిజిటల్ లైబ్రరీ
- ప్రారంభించి పది నెలలు గడిచినా, నేటికీ వినియోగంలోకి రాని వైనం
- ఉత్తరాంధ్రలోనే మొదటగా నిర్మించిన భవనం దుస్థితి ఇది
- గ్రంథాలయంలో మచ్చుకైనా కానరాని పుస్తకాలు, ఫర్నిచర్

పాతగొట్టువాడలో నిరుపయోగంగా ఉన్న డిజిటల్ లైబ్రరీ భవనం

ప్రజాశక్తి -కోటవురట్ల: అలంకారానికి మారురూపుగా కోటవురట్ల మండలంలోని పాతగొట్టువాడలోని డిజిటల్ లైబ్రరీ సాక్షాత్కరిస్తోంది. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల్లో ఒకటైన దీన్ని, స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రతిష్టాత్మకంగానే నిర్మించి, ప్రారంభించి నెలలు గడుస్తున్నా నేటికీ వినియోగంలోకి రాలేదు. పేరుకు డిజిటల్ లైబ్రరీ అయినా, అందులో పాఠకులు చదివేందుకు ఎటువంటి పఠన పరికరాలుగానీ, కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు, ఇతర ఫర్నిచర్ కానరాదు. బయటకు అందంగా, ఆర్భాటంగా కనిపిస్తున్నా, లోపలంతా డొల్లే. దీంతో లక్షల రుపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించి, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్భాటంగా ప్రారంభించి నెలలు గడుస్తున్నా, నేటికీ అది నిరుపయోగంగానే ఉంది. ఉత్తరాంధ్రలోనే మొదటగా ప్రారంభించిన మండలంలోని పాతగొట్టువాడ డిజిటల్ లైబ్రరీ దుస్థితి ఇది.

ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా భవన నిర్మాణం పూర్తిచేసుకుని, ఎమ్మెల్యే బాబూరావు ఆర్భాటంగా ప్రారంభించిన పాత గొట్టువాడ గ్రామంలోని డిజిటల్ లైబ్రరీ వఛూగా దర్శనమిస్తుంది. రూ,17 లక్షలతో నిర్మించి, పది నెలల క్రితమే ప్రారంభించిన ఈ డిజిటల్ లైబ్రరీ నేటికీ వినియోగంలో తీసుకురాకపోవడంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు, రూ.లక్షలు ఖర్చుపెట్టి, భవనాన్ని నిర్మించారే గానీ, అది డిజిటల్ లైబ్రరీ అనకునేందుకు ఇతర సౌకర్యాలను నేటికీ కల్పించలేదు. భవనంలో కూర్చునేందుకు కనీసం కుర్చీగానీ, బెంచీగానీ లేదు. పఠన పరికరాలూ కానరావు. ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా నిర్మాణం పూర్తి చేసుకుని, ప్రారంభిస్తున్నామంటూ స్థానిక నాయకులు అప్పట్లో గొప్పగా చెప్పుకున్నా, దీనిలో ఫర్నిచర్‌గానీ, పుస్తకాలుగానీ లేకపోవడంతో ఒట్టి భవనం నేటికీ వృథాగా దర్శనమిస్తోంది. మండల వ్యాప్తంగా 19 సచివాలయాల పరిధిలో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించినా, నేటికీ ఎక్కడా అటువంటి ఆనవాళ్లే లేవు. నిర్మించి, ప్రారంభించిన పాత గొట్టువాడ డిజిటల్ లైబ్రరీ నిరుపయోగంగా ఉంది. పథకాలను ప్రకటించడం, దానిపై ఆర్భాటంగా ప్రచారం చేయడమేగానీ, వాటి అమలు, వినియోగంలో చిత్తశుద్ధి లేమికి నిలువెత్తు నిదర్శనంగా పాతగొట్టువాడ డిజిటల్ లైబ్రరీ నిలుస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా దీన్ని వినియోగంలోకి తేవడంతోపాటు మిగతా భవనాలను పూర్తిచేసే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కూటమి ఎన్నికల కార్యాలయం ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి - మాడుగుల : మాడుగుల నియోజకవర్గ కేంద్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎన్నికల కార్యాలయాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాయపురెడ్డి కృష్ణ, బీజేపీ నాయకులు పుట్టా గంగయ్యలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ, ఐదేళ్ల వైసిపి పాలనలో మాడుగుల నియోజకవర్గ అభివృద్ధి అతీగతీ లేకుండా పోయిందన్నారు. అవినీతి, అక్రమాలు శ్రుతిమించి పోయాయన్నారు. రాష్ట్రంలో పాలన గాడిలో పడాలన్నా, మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడవాలన్నా కూటమి అభ్యర్థుల విజయం ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిసహకారం అందిస్తానని కూటమి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ భరోసానిచ్చారన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో మాడుగుల ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపీగా సీఎం రమేష్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి పార్టీల పొత్తుతో ఓటమి భయం పట్టుకున్న వైసిపి నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. వనరులు, వ్యవస్థలను విధ్వంసం చేసి జగన్‌రెడ్డి కంటే సంపద సృష్టించగల సత్తా ఉన్న చంద్రబాబు పాలన ప్రస్తుత తరుణంలో రాష్ట్ర మనుగడ, అభివృద్ధికి అవసరమన్నారు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, పట్టణ అధ్యక్షుడు రంజిత్ వర్మ, క్లస్టర్ ఇంచార్జి పుప్పాల రమేష్, దంగేటి సూర్యారావు, ఉండూరు రాజు, లెక్కల కాశిబాబు, వడ్డాది వరలక్ష్మి, మండల సంతోషి సుబ్బలక్ష్మి, వేమన చినకొండలరావు, గట్రెడ్డి శివాజీ పాల్గొన్నారు.

బోరు బాగు చేయరూ..?

పాతరోడ్డు సమీపంలో పాడైన బోరు

ప్రజాశక్తి -కోటవురట్ల: పాత రోడ్డు సమీపంలోని మంచినీటి బోరును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు, ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన బోరు గడిచిన 10 నెలలుగా పనిచేయకపోవడంతో సమీప ప్రాంతవాసులు తాగునీటి అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారు, ప్రధాన రహదారికి అనుకుని కూడలి వద్ద ఉండడంతో పలువురు బోరు దగ్గరికి వచ్చి నీళ్లు రాకపోవడంతో వెనుతిరుగుతున్నారు, మండుతున్న వేసవిని దష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పచ్చదనంపై విధ్వంసం!

- విద్యుత్ లైన్ ఏర్పాటులో మాయమౌతున్న చెట్లు
- రోడ్డుకు రెండువైపులా ఉన్న చెట్లను కొట్టేస్తున్న వైనం
- ఆవేదన చెందుతున్న ప్రజలు, ప్రజాసంఘాలు

రోడ్డు అంచుల్లో ఇరువైపులా కొట్టేసిచ చెట్ల వ్యర్థాలు

నరికేయగా మిగిలిన చెట్టు మొదలు

ప్రజాశక్తి - కోటవురట్ల :మండల వ్యాప్తంగా ఇటీవల పలు గ్రామాలలో జరుగుతున్న విద్యుత్ లైన్ పనుల కారణంగా పచ్చదనంపై విధ్వంసం కొనసాగుతుంది, ఎవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా ఉపాధి హామీ నిధులతో రహదారికి ఇరువైపులా గడిచిన రెండు దశాబ్ధాలుగా రూ.లక్షలు వెచ్చించి, నాటిన, పెంచిన మొక్కలు, నేడు వృక్షాలుగా మారి పచ్చదనాన్ని అందిస్తున్న తరుణంలో, వాటిని మొదళ్లకంటూ కొట్టేస్తూ తొలగించడంపై పలువురు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ లైన్ల ఏర్పాటు అవసరమే అయినప్పటికీ, వాటికోసం పచ్చదనం కనుమరగయ్యేలా చేపట్టే చర్యలపై పలువురు పెదవి విరుస్తున్నారు.

ముక్కలు,ముక్కలుగా మారిన పచ్చని చెట్లు

లింగాపురం నుండి వెంకటాపురం మీదుగా చిన్న బొడ్డేపల్లి, పికె పల్లి, పాములవాక తదితర గ్రామాలకు ఇరువైపులా చెట్లను విస్తారంగా పెంచారు, చూసేందుకు ఆహ్లాదకరమే కాకుండా, పచ్చదనాన్ని కూడా అందిస్తున్న ఈ చెట్లు ఇపుడు రోడ్లపై వెళ్లే వాహనదారులు, రైతులకు సేదనిచ్చే ఆవాసాలుగా ఉన్నాయి. ఇపుడు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు వాటి కొమ్మలు కాకుండా, ఏకంగా మొదళ్లకంటూ చెట్లనే కొట్టేస్తుండడంపై పలువురు ఆవేదన చెందుతున్నారు. వీటిని పూర్తిగా తొలగించడం వల్ల ఎండ వేడిమి నుంచి రక్షణకు నీడలేని దుస్థితి నెలకొంటోందని అంటున్నారు. వృక్షాలను మొదళ్లకంటూ తొలగించడం అధికారుల ముందుచూపులేని, అనాలోచిత చర్యలుగానే ప్రజాసంఘాలు, ప్రజలు విమర్శిస్తున్నారు. పచ్చగా ఉండే చెట్లను నిర్ధాక్షిణ్యంగా తొలగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో విద్యుత్ లేను ఏర్పాటు చేస్తే బాగుండేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పచ్చని చెట్లు తొలగించడంతో ఆహ్లాదకరమైన వాతావరణం కనుమరుగవడమే కాకుండా, ఎండ,వానల నుంచి రక్షణకు నీడ లేకుండా పోతోందని పలువురు వాపోతున్నారు.